Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

ఆదివారం
4 ఆగస్టు 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 91
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar


## ప్రపంచ ఆహార భద్రతకు భారత్ కృషి చేస్తోంది

- సమగ్ర వ్యవసాయ విధానంపై 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఫోకస్
- గతంలో అప్పుడే భారత్ స్వతంత్ర్యాన్ని సాధించింది
- ఆ సమయంలో దేశం వ్యవసాయ, ఆహార భద్రత సవాళ్లను ఎదుర్కొన్నది
- ఇప్పుడు భారత్ ఆహార మిగులు దేశంగా మారింది
- పాలు, పప్పు దినుసులు, మసాలాలు ఉత్పత్తి చేయడంలో భారత్ నెంబర్‌వన్‌గా ఉంది
- ఓ దశలో భారత ఆహార భద్రత విషయంలో ప్రపంచం ఆందోళన చెందినది



## కేరళ ప్రభుత్వానికి కర్ణాటక ఆపన్న హస్తం

- వయనాడ్ బాధితులకు 100 ఇళ్లు నిర్మించిస్తామని ప్రకటన
- ఇప్పటికే పలువురు సినీ తారలు, రాజకీయ నేతల కేరళ సీఎం డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ కు విరాళాలు
- బాధితులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని కేరళ సీఎంకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హామీ







### పేదోడి ఆలోచనకు అనుగుణంగా

## ఇండస్ట్రీయల్ పార్కు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ప్రజల దీవెనలతో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది
- అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు రెండు కళ్లు, జోడెడ్ల లాగా సాగుతున్నాయి

జయశంకర్ భూపాలపల్లి, శుభ తెలంగాణ

పేదోడి ఆలోచనకు అనుగుణంగా గాంధీనగర్ ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజల దీవెనలతో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు రెండు కళ్లు, జోడెడ్ల లాగా సాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి - మిగతా3లో

# 3 లక్షల కోట్లు!

- వచ్చే పదేళ్లలో అసలు, వడ్డీలకు చెల్లించాల్సిన మొత్తం ఇది
- ఈ ఏడాది ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌కు దాదాపు సమానం
- కొత్తగా తెచ్చే అప్పుల్లో అసలు, వడ్డీలకే 76.73 శాతం
- జీఎస్టీ అవకతవకలతో ఖజానాకు రూ.986 కోట్ల నష్టం
- 2022-23 ఆర్థిక సంవత్సరపు నివేదికలో కాగ్ ఆక్షేపణలు



హైదరాబాద్, శుభ తెలంగాణ

"రాష్ట్ర ప్రభుత్వం అప్పుల వడ్డీలు, అసలుకే పదేళ్లలో రూ.2.90 లక్షల కోట్లు చెల్లించాలి. ఇప్పుడు బహిరంగ మార్కెట్ నుంచి కొత్తగా అప్పులు తెచ్చినా.. వచ్చే ఆ మొత్తం నుంచి 76.73% పాత అప్పుల అసలు, వడ్డీలకే చెల్లించే పరిస్థితి. సర్కారుకు నికరంగా మిగిలే నిధులు 23.27% మాత్రమే" అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తీవ్రస్థాయిలో ఆక్షేపించింది. ఇలా అప్పులు తెచ్చి.. రుణాలను తీర్చే పద్ధతి ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం ఆరోగ్యకరం కాదని అభిప్రాయపడింది. అప్పులపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ విడుదల చేసిన వార్షిక నివేదికను - మిగతా3లో




## ఐఏఎస్‌లకు స్థానచలనం..

రవాణా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎసగా వికాసరాజ్

వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవి ఎస్సీ అభివృద్ధి శాఖకు బదిలీ

హైదరాబాద్, శుభ తెలంగాణ

రాష్ట్రంలో మరోమారు ఐఏఎస్ అధికారుల బదిలీ జరిగింది. ఇద్దరు నాన్ ఐఏఎసలు సహా ఎనిమిది మంది అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణ, సాధారణ పరిపాలనా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాసరాజ్ పోస్టులో స్వల్ప మార్పు చేసింది. ఆయన పోస్టును రవాణా, రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రీ-డిజిగ్నేట్ చేసింది.ల వికాసరాజ్ ఇక నుంచి రవాణా, ఆర్ అండ్ బీ, గృహ నిర్మాణ, సాధారణ పరిపాలనా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవిని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ - మిగతా3లో



## మాజీ సీజేఐ రమణతో మందకృష్ణ భేటీ

### తీర్పు అమలుపై సలహాలు కోరిన మాదిగ నేత

హైదరాబాద్, శుభ తెలంగాణ

ఎస్సీ వర్గీకరణ ద్వారా రిజర్వేషన్ ఫలాలు దక్కాలంటే ఇప్పుడు రాష్ట్రాల్లో పోరాటాలు చేయాలని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. శనివారం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ బృందం మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణతో భేటీ అయ్యింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో దీన్ని ఎలా అమలు చేయాలి.. ఎలా ముందుకు సాగాలన్న - మిగతా3లో

## నాలుగేళ్లుగా ఎదురు చూపులు

- ఎల్ఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి కీలక నిర్ణయాలు
- నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని,
- ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని
- తమ ప్రభుత్వం మీద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు
- కేసీఆర్ ప్రభుత్వం ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31, 2020 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించింది




హైదరాబాద్, శుభ తెలంగాణ

లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చే ఎల్ఆర్ఎస్‌ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. తమ ప్రభుత్వం మీద ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, మధ్య దళారుల ప్రమేయం లేకుండా సాధారణ ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియలో ముఖ్యంగా ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై శనివారం నాడు జిల్లా కలెక్టర్‌లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ - మిగతా3లో




## ఎస్‌బీఐ రివార్డ్ పేరుతో ఫేక్ సందేశాలు

- కీలక హెచ్చరికలు చేసిన కేంద్రం!
- ఎస్‌బీఐ ఖాతా రివార్డ్ పాయింట్స్ ఉన్నాయని.. వాటిని క్లైమ్ చేసుకునేందుకు ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ ఓ ఫేక్ మెస్సేజ్
- రివార్డ్ పాయింట్ల పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు
- వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంకు వివరాలను సైతం ఎవరితో వెల్లడించొద్దు

### సుప్రీంతీర్పు ఎవరికీ

## వ్యతిరేకం కాదు

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ పనిచేశారు

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ప్రశంస

హరితప్లాజా హోటల్‌లో మాదిగ నేతల భేటీ



హైదరాబాద్, శుభ తెలంగాణ

ఎస్సీ వర్గీకరణపై తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎవరికీ వ్యతిరేకం కాదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరూ సమానులేనని చెప్పారు. ఈ తీర్పుతో మొత్తం మాదిగజాతి తలరాతలు మారబోవని, 15 శాతం రిజర్వేషన్ వస్తే మిగతా 85 శాతం కోసం పోటీపడేలా యువత సిద్ధంకావాలని సూచించారు. శనివారం హైదరాబాద్ హరితప్లాజాలో - మిగతా3లో

# ప్రపంచ ఆహార భద్రతకు భారత్ కృషి చేస్తోంది

**న్యూఢిల్లీ:** భారత్‌లో ఆహార నిల్వలు సమృద్ధిగా ఉన్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఇక ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార, పోష్టికార భద్రతకు పరిష్కారాలు చూపేందుకు భారత్ పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 65 ఏళ్ల తర్వాత ఇండియాలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎకానమిస్ట్స్ సదస్సులో ఆయన మాట్లాడారు. సమగ్ర వ్యవసాయ విధానంపై 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఫోకస్ పెట్టినట్లు ప్రధాని మోదీ తెలిపారు. గతంలో ఇండియాలో ఈ సమావేశాన్ని నిర్వహించినప్పుడు, అప్పుడే భారత్ స్వతంత్ర్యాన్ని సాధించిందని, ఆ సమయంలో దేశం వ్యవసాయ, ఆహార భద్రత సవాళ్లను ఎదుర్కొన్నదన్నారు. ఇప్పుడు భారత్ ఆహార మిగులు దేశంగా మారిందన్నారు.



పాలు, పప్పు దినుసులు, మసాలాలు ఉత్పత్తి చేయడంలో భారత్ నెంబర్‌వన్‌గా ఉందన్నారు. ఆహారధాన్యాలు, పండ్లు, కూరగాయలు, దూది, చక్కెర, టీ పొడి ఉత్పత్తిలో ఇండియా రెండవ స్థానంలో ఉన్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఓ దశలో భారత ఆహార భద్రత విషయంలో ప్రపంచం ఆందోళన చెందినదని, కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహారభద్రత, పౌష్టికార భద్రతకు సంబంధించిన సమస్యలకు పరిష్కారాలు ఇస్తోందని మోదీ చెప్పారు. రైతు ఆర్థికవేత్తలకు సదస్సుకు 70 దేశాలకు చెందిన వెయ్యి మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆగస్టు రెండ నుంచి ఏడవ తేదీ వరకు ఈ సదస్సు జరగనున్నది. గడిచిన పదేళ్లలో విభిన్న వాతావరణాన్ని తట్టుకునే 1900 రకాల పంట వెరైటీలను భారత్ అభివృద్ధి చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. కెమికల్ ఫ్రీ నేచరల్ ఫార్మింగ్‌ను ఇండియా ప్రమోట్ చేస్తున్నట్లు తెలిపారు.

# కేరళ ప్రభుత్వానికి కర్ణాటక ఆపన్న హస్తం

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 358 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కష్టకాలంలో బాధితులను ఆదుకునేందుకు పలువురు తమ వంతు సాయం అందిస్తున్నారు. ఇప్పటికే పలువురు సినీ తారలు, రాజకీయ నేతలు కేరళ సీఎం డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ కు విరాళాలు అందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కర్ణాటక ప్రభుత్వం కూడా కేరళ రాష్ట్రానికి ఆపన్న హస్తం అందించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులకు 100 ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎక్స్ వేదికగా వెల్లడించారు. బాధితులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని కేరళ సీఎంకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మరోవైపు సీఎండీఆర్‌ఎఫ్‌కు ఇప్పటికే పలువురు సినీ తారలు విరాళం అందించిన విషయం తెలిసిందే. నయనతార - విఘ్నేశ్ దంపతులు రూ.20 లక్షలు, విక్రమ్ రూ.20 లక్షలు, హీరో సూర్య ఫ్యామిలీ జ్యోతిక, హీరో కార్తి కలిసి సంయుక్తంగా కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలను అందించారు. అదేవిధంగా మలయాళ నటులు



మమ్ముట్టి, ఆయన తనయుడు దుల్కర్ సల్మాన్ కలిసి రూ.35 లక్షలు, మోహన్‌లాల్ రూ.25లక్షలు, ఫహాద్ ఫాజిల్ రూ.25 లక్షలు, రష్మిక ర.10 లక్షలు విరాళంగా అందించారు.

# టెలికాం సంస్థలకు ట్రాయ్ కొత్త నిబంధనలు

టెలికాం కంపెనీలు తప్పనిసరిగా పాటించాల్సిన కొత్త నిబంధనలను టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజాగా విడుదల చేసింది. ఈ నిబంధనలు పాటించని కంపెనీలకు జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేసింది. ఇక ట్రాయ్ తీసుకొచ్చిన కొత్త సేవా నిబంధనల ప్రకారం, జిల్లా స్థాయిలో నెట్‌వర్క్ అంతరాయం కలిగితే పోస్ట్ పెయిడ్ కస్టమర్లకు అద్దెపై రిబేటు ఇవ్వాల్సి ఉంటుంది. అదే ప్రీపెయిడ్ వినియోగదారులకు అయితే కనెక్షన్ చెల్లుబాటు గడువు పెంచాలి. నెట్‌వర్క్ అంతరాయం 24 గంటలకు మించితే సర్వీసు ప్రొవైడర్లు అద్దెలో కొంత భాగాన్ని రిబేటుగా ఇవ్వాల్సి ఉంటుంది. పోస్ట్ పెయిడ్ వినియోగదార్లకు వచ్చే బిల్ సైకిల్లో వాటిని చూపించాలి. 12 గంటలకు పైగా అంతరాయం ఉన్నా అద్దెలో రిబేటు లేదా వ్యాలిడిటీ కొనసాగింపునకు దానికి ఒక రోజుగానే పరిగణించాల్సి ఉంటుంది. వారం రోజుల్లోగా నెట్వర్క్ సమస్య లేకుండా చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో మాత్రమే, ఈ ప్రయోజనాలను అందించాల్సిన అవసరం ఉండదు.

**జరిమానాలు ఇలా..**

నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో విఫలమైతే కంపెనీలకు కనీస అపరాధ రుసుమును రూ.50,000 నుంచి రూ.1లక్షకు పెంచింది ట్రాయ్. నిబంధనల ఉల్లంఘనల గ్రేడ్లను బట్టి రూ.1 లక్ష, రూ.2 లక్షలు, రూ.5 లక్షలు, రూ.10 లక్షల మేర జరిమానాను విధిస్తుంది. ప్రైమరీ, సెల్యులార్ మొబైల్ సర్వీసెస్, బ్రాడ్ బ్యాండ్ సేవలు, బ్రాడ్




బ్యాండ్ వైర్లెస్ సేవలకు ట్రాయ్ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఫిక్స్డ్ లైన్ సర్వీసు ప్రొవైడర్లు అయినా పోస్ట్ పెయిడ్, ప్రీ పెయిడ్ కస్టమర్లకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. తమ నెట్‌వర్క్‌లోని వైఫల్యానికి మూడు రోజుల్లోగా పరిష్కారం చూపాల్సిందే. చెల్లింపు చేసిన 7 రోజుల్లో బ్రాడ్ బ్యాండ్ సర్వీసు ప్రొవైడర్లు 98 శాతం కనెక్షన్లను యాక్టివేట్ చేయాలి. టెల్కోలు తమ వెబ్‌సైట్లలో సర్వీసు ప్రకారం (2జీ, 3జీ, 4జీ, 5జీ) జియో స్పేషియల్ కవరేజీ మ్యాప్లను వినియోగదారుల సౌకర్యం కోసం తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుంది. కాగా, మరో ఆరు నెలల తర్వాత ట్రాయ్ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. సేవల నాణ్యతను మెరుగుపరచడంతో పాటు టెలికాం ఆపరేటర్ల నుండి జవాబుదారీతనం ఉండేలా చూడటమే లక్ష్యంగా కొత్త నిబంధనలను ట్రాయ్ తీసుకువస్తోంది. ఈ నిబంధనలను అమలు చేయడం ద్వారా దేశవ్యాప్తంగా టెలికాం సేవల్లో వినియోగదారుల సంతృప్తి, విశ్వసనీయతను పెంచడానికి ట్రాయ్ ప్రయత్నిస్తుంది.

## న్యాయమూర్తిని బెదిరించిన ఐఏఎస్ అధికారి.. కోర్టుకు రావాలంటూ సమన్లు

శ్రీనగర్: ఒక కేసులో పరిహారం చెల్లించాలన్న కోర్టు తీర్పును ఐఏఎస్ అధికారి లెక్కచేయలేదు. దీంతో ఆయన జీతాన్ని అటాచ్ చేయాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. అయితే ఆ జడ్జిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఐఏఎస్ అధికారి ప్రయత్నించారు. న్యాయమూర్తి నివాసానికి అధికారులను పంపి ఆయనను బెదిరించడంతోపాటు వేధింపులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో క్రిమినల్ ధిక్కారానికి పాల్పడిన ఐఏఎస్ అధికారికి హైకోర్టు సమన్లు జారీ చేసింది. జమ్ముకశ్మీర్‌లో ఈ సంఘటన జరిగింది. 2018 బ్యాచ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారి శ్యాంబీర్ సింగ్, 2022 నుంచి గందర్బాల్ జిల్లా కమిషనర్‌గా పని చేస్తున్నారు. కాగా, ఒక కేసులో బాధిత పక్షానికి న్యాయస్థానం ద్వారా పరిహారం చెల్లించాలన్న 2022 అక్టోబరు నాటి కోర్టు డిక్రీని ఐఏఎస్ అధికారి శ్యాంబీర్ సింగ్ పాటించలేదు. దీంతో ఆయన జీతాన్ని అటాచ్ చేయాలని గందర్బాల్ జిల్లా కోర్టు జడ్జి ఫయాజ్ అహ్మద్ ఖురేషీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆ న్యాయమూర్తిపై ప్రతీకారం తీర్చుకునేందుకు డిప్యూటీ కమిషనర్ ప్రయత్నించారు. జడ్జి ఫయాజ్‌ను భయపెట్టేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ప్రభుత్వ అధికారులను న్యాయమూర్తి ఇంటికి పంపి వేధించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. మరోవైపు జడ్జి ఫయాజ్ అహ్మద్ ఖురేషీ ఫిర్యాదును జమ్ముకశ్మీర్ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. గందర్బాల్ జిల్లా కమిషనర్ శ్యాంబీర్ సింగ్‌కు సమన్లు జారీ చేసింది. ఆగస్ట్ 5న ఉదయం 11 గంటలకు కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని పేర్కొంది. ఆ ఐఏఎస్ అధికారిపై వచ్చిన క్రిమినల్ ధిక్కార ఆరోపణలపై వ్యక్తిగతంగా సమాధానం ఇవ్వాలని జస్టిస్ అతుల్ శ్రీధరన్, జస్టిస్ సంజీవ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. సమన్లు పట్టించుకోకపోయినా, కోర్టుకు హాజరుకాకపోయినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. విచారణలో కోర్టుకు సహకరించేందుకు సీనియర్ న్యాయవాది రియాజ్ అహ్మద్ జాన్‌ను అమికస్ క్యూరీగా హైకోర్టు నియమించింది.



## హిమాచల్‌ప్రదేశ్‌లో క్లౌడ్‌బరస్ట్.. కొట్టుకుపోయిన గ్రామం!

**వరదలకు తుడిచిపెట్టుకుపోయిన సమేజ్ అనే గ్రామం**

**కేవలం ఒక్క ఇల్లు మాత్రమే మిగిలిన వైనం**

**'మేఘ విస్ఫోటనం'తో విలయం సృష్టించిన మెరుపు వరదలు**

హిమాచల్ ప్రదేశ్‌లో ఇటీవల విలయం సృష్టించిన 'మేఘ విస్ఫోటనం' (క్లౌడ్ బరస్ట్) ఒక గ్రామాన్ని సమూలంగా తుడిచిపెట్టేసింది. మెరుపు వరదలలో సమేజ్ అనే గ్రామం మొత్తం కొట్టుకుపోయింది. కేవలం ఒకే ఒక్క ఇల్లు మాత్రమే మిగిలివుంది. హృదయాన్ని కలచివేసే ఈ విషాద ఉదంతాన్ని అదే గ్రామానికి చెందిన అనితా దేవి అనే మహిళ తెలిపింది. బుధవారం రాత్రి తమ కుటుంబ సభ్యులందరం నిద్రిస్తున్న సమయంలో పెద్ద శబ్దం వచ్చిందని, తమ ఇల్లు కదిలిపోయిందని ఆమె చెప్పింది. తాము బయటకు వెళ్లి చూడగా ఊరు మొత్తం కొట్టుకుపోయిందని ఆమె విలపించింది. వెంటనే గ్రామంలోని భగవతి కాళీ మాత ఆలయానికి పరిగెత్తుకెళ్లి రాత్రంతా అక్కడే గడిపామని ఆమె భావోద్వేగంతో చెప్పింది. వర్షం విధ్వంసం నుంచి తమ ఇల్లు మాత్రమే బయటపడిందని, కానీ ఇంట్లోని వస్తువులన్నీ కళ్ల ముందే కొట్టుకుపోయాయని వాపోయారు. ఇప్పుడు తాము ఎవరితో కలిసి జీవించాలో తెలియడంలేదని కన్నీరు పెట్టింది. సమేజ్ గ్రామానికే చెందిన బక్షి రామ్ అనే వృద్ధుడు కన్నీటి పర్యంతమవుతూ తన బాధను పంచుకున్నాడు. "నా కుటుంబానికి చెందిన దాదాపు 14 నుంచి 15 మంది వరదలో కొట్టుకుపోయారు. రాంపూర్ అనే ఊరిలో ఉన్న నాకు తెల్లవారుజామున 2 గంటల సమయంలో వరదలకు సంబంధించిన సమాచారం అందింది. ఆ సమయంలో వెళ్లలేక తెల్లవారుజామున 4 గంటలకు గ్రామానికి వచ్చాను. నాకు ఆప్యాయతను పంచే కుటుంబ సభ్యుల కోసం ప్రస్తుతం వెతుకుతున్నాను. ఎవరైనా ప్రాణాలతో బతికి ఉంటారేమోనన్న ఆశతో ఎదురుచూస్తున్నాను" అని ఆ పెద్దాయన కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా డిస్ట్రిక్ట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం.. క్లౌడ్ బరస్ట్ కారణంగా ఏర్పడిన మెరుపు వరదల ప్రభావంతో హిమాచల్ ప్రదేశ్‌లోని కులు, మండి, సిమ్లా ప్రాంతాలలో మొత్తం 53 మంది తప్పిపోయారని శనివారం నాటికి తేల్చారు. ఇందులో కేవలం ఆరుగురి మృతదేహాలను మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఇక వరదల కారణంగా 60కిపైగా ఇళ్లు కొట్టుకుపోయాయని, పలు గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయని డిస్ట్రిక్ట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రత్యేక కార్యదర్శి డీసీ రాణా వెల్లడించారు.

## ఎస్‌బీఐ రివార్డ్ పేరుతో ఫేక్ సందేశాలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు కేంద్రం కీలక హెచ్చరిక చేసింది. ఎస్‌బీఐ ఖాతా రివార్డ్ పాయింట్స్ ఉన్నాయని.. వాటిని క్లైమ్ చేసుకునేందుకు ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ ఓ ఫేక్ మెస్సేజ్ వాట్సాప్‌లతో పాటు మెస్సేజ్‌లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో రివార్డ్ పాయింట్ల పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు చేసింది. నకిలీ సందేశాలను చూసి స్పందించొద్దని సూచించింది. వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంకు వివరాలను సైతం ఎవరితో వెల్లడించొద్దని చెప్పింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ ద్వారా ఈ హెచ్చరికలు చేసింది. రివార్డ్ పాయింట్ల రిడీమ్ చేసుకునేందుకు లింక్‌ని ఓపెన్ చేయాలని చెబుతుందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ లింక్‌ను ఓపెన్ చేయొద్దని.. అలాగే మరెవరికీ షేర్ చేయొద్దని సూచించింది.




అలా చేస్తే మోసగాళ్ల బారినపడే ప్రమాదం ఉంటుందని తెలిపింది. ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా ఎస్‌బీఐ లోగోను వాడుతూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఎస్‌బీఐ బ్యాంక్ రివార్డ్ పాయింట్ల పేరుతో ఫేక్ మెసేజెస్ వస్తుండడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ ఇలాంటి తరహా మోసాలకు నేరగాళ్లు పాల్పడిన సందర్భాలున్నాయి. ఇక ఫేక్ మెసేజ్‌లలో 'ప్రియమైన కస్టమర్, మీ ఎస్‌బీఐ నెట్‌బ్యాంకింగ్ రివార్డ్ పాయింట్‌ల (రూ.9980.00) గడువు నేటితో ముగుస్తుంది. ఇప్పుడు ఎస్‌బీఐ రివార్డ్ యాప్ ఇన్‌స్టాల్ ద్వారా రిడీమ్ చేసుకోండి. నేరుగా మీ ఖాతాలో నగదు డిపాజిట్ అవుతుంది' అంటూ ఫేక్ మెసేజ్ వస్తున్నది. ఈ క్రమంలో కేంద్రం అప్రమత్తం చేస్తూ తెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలను లింక్‌లను క్లిక్ చేయొద్దని.. పాస్‌వర్డ్, క్రెడిట్‌కార్డుల వివరాలు ఎవరికీ చెప్పొద్దని కేంద్రం సూచించింది.

## కారుతో స్టంట్ చేసిన మైనర్ బాలుడు.. స్కూటర్‌ను ఢీకొట్టడంతో మహిళ మృతి, బాలికకు గాయాలు



**లక్నో:** మైనర్ బాలుడు కారుతో స్టంట్ చేశాడు. అదుపుతప్పిన ఆ కారు ఒక స్కూటర్‌ను ఢీకొట్టింది. డ్రైవ్ చేసిన మహిళ మరణించగా, ఆమె కుమార్తె గాయపడింది. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం 17 ఏళ్ల బాలుడు తన స్నేహితులతో కలిసి కారు డ్రైవ్ చేశాడు. ఈ సందర్భంగా బిజీ రోడ్డులో కారుతో స్టంట్ చేశాడు. వంద కిలోమీటర్ల వేగంతో కారును అడ్డంగా నడిపాడు. కాగా, కారు స్టంట్ బెడిసికొట్టింది. అదుపుతప్పిన అది స్కూటర్‌పైకి దూసుకెళ్లింది. ఆ స్కూటర్‌ను డ్రైవ్ చేసిన మహిళ, వెనుక కూర్చొన్న ఆమె కుమార్తె గాలిలోకి ఎగిరిపడ్డారు. ఆ మహిళ హెల్మెట్ ధరించినప్పటికీ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో మరణించింది. ఆమె కుమార్తె అయిన 12 ఏళ్ల బాలిక కూడా గాయపడింది. వారిద్దరూ స్కూటర్‌పై ఆసుపత్రికి వెళ్లి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న కాన్పూర్ పోలీసులు మైనర్ బాలుడితోపాటు అతడి తండ్రిని అరెస్ట్ చేశారు. స్కూల్ ఎగ్గొట్టిన ఆ బాలుడు తన స్నేహితులతో కలిసి కారుతో విన్యాసాలు చేసినట్లు తెలిపారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఆ కారులో ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారని స్థానికులు తెలిపారు. కాగా, కారు డ్రైవ్ చేసిన బాలుడ్ని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు అక్కడి నుంచి పారిపోయారు. స్కూటర్‌ను ఢీకొట్టడానికి ముందు పార్క్ చేసిన తన బైక్‌ను కూడా ఆ కారు ఢీకొట్టిందని ఒక వ్యక్తి తెలిపాడు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఎస్పీ నేత అక్రమ బేకరీపై యోగి 'బుల్డోజర్' యాక్షన్



**లక్నో:** అక్రమార్కులపై యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బుల్డోజర్ చర్యలు కొనసాగిస్తోంది. ఆగస్టు 2న 'అయోధ్య రేప్ కేసు'లో నిందితుడిగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ నేత మొయీద్ ఖాన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో జిల్లా యంత్రాగం శనివారంనాడు బుల్డోజర్ యాక్షన్‌కు దిగింది. ఆయన పేరుతో ఉన్న బేకరీని బుల్డోజర్‌తో నేలమట్టం చేసింది. మొయీద్ ఖాన్ నడుపుతున్న బేకరిపై ఫుడ్ సేఫ్టీ డిప్యూటీ కమిషనర్ రెయిడ్ చేశారు. బేకరిలో తయారైన ఉత్పత్తులను పరీక్షించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. భదర్సాలో 'ఎవోన్ బేకరి' పేరుతో దీనిని మొయిద్ ఖాన్ నడుపుతున్నారు. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజకరణ్ నాయర్ ఒక బుల్డోజర్‌తో కలిసి బేకరి ఉన్న స్థలానికి చేరుకుని ప్రాపర్టీ మెజర్‌మెంట్ చేపట్టాను. అనంతరం బుల్డోజర్ యాక్షన్ చేపట్టారు. అక్రమంగా బేకరీని నడుపుతున్నట్టు నిర్ధారణ కావడంతో దానికి సీల్ వేశామని, అనంతరం కూల్చివేత పనులు చేపట్టాని ఎస్‌డీఎం అశోక్ కుమార్ తెలిపారు. ఒక చెరువు చుట్టూ అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడను సైతం అధికారులు కూల్చేశారు.

యోగిని కలిసిన కలిసిన బాధితురాలి తల్లి

అయోధ్యలోని బదర్సా ప్రాంతంలో తన కుమార్తెపై అత్యాచారం జరగడంతో బాధితురాలి తల్లి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఇటీవల కలుసుకుని ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా యంత్రాగం వెంటనే రంగంలోకి దిగారు. అత్యాచారం కేసు నమోదు చేయడంలోనూ, తగిన చర్య తీసుకోవడంలోనూ జాప్యం చేసిన పోలీస్ చౌకీ ఇన్‌చార్జి, స్టేషన్ ఇన్‌చార్జిని సస్పెండ్ చేసారు. కేసులో ప్రధాన నిందితుడైన మొయిద్ ప్రాపర్టీపై విచారణ చేపట్టారు. పార్టీలతో సంబంధం లేకుండా క్రిమినల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఇటీవల తెలిపారు.

# 3 లక్షల కోట్లు!

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే..!

ఇందులో రాష్ట్ర ఆర్థిక స్థితిని కాగ్ సాంతం మదింపు చేసింది. రాష్ట్ర అప్పుల విధానాన్ని తూర్పారబట్టింది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అప్పులు 2022-23 సంవత్సరానికి రూ.3,49,537 కోట్లుగా ఉన్నట్లుగా పేర్కొన్న కాగ్.. వివిధ కార్పొరేషన్ల పేర తీసుకున్న గ్యారెంటీ రుణాలు మరో రూ.1,18,629 కోట్లని గుర్తుచేసింది. అంటే.. మొత్తం అప్పు రూ.4,68,166 కోట్లుగా ఉన్నట్లు స్పష్టం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి 2032-33 వరకు.. మొత్తం పదేళ్లలో ఈ అప్పుల అసలు, వడ్డీల సొమ్మును చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అంతేకాకుండా.. జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి రూ.9,477 కోట్లు, భారత జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)కు రూ.36 కోట్లు, భారత సాధారణ బీమా సంస్థకు రూ.7 కోట్లు, ఉదయ్ బాండ్లకు సంబంధించి రూ.8,031 కోట్లు, వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డ్)కు రూ.5,526 కోట్లు, జాతీయ సహకారాభివృద్ధి సంస్థ(ఎన్సీడీసీ)కు రూ.59 కోట్లను చెల్లించాలని వివరించింది. ఇలా పదేళ్లలో బడ్జెట్ రుణాలు, గ్యారెంటీ రుణాలు, ఇతర ఆర్థిక సంస్థల అప్పులకు సంబంధించి అసలు, వడ్డీల కింద మొత్తం రూ.2,90,154 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది. ఇది ప్రస్తుత బడ్జెట్‌కు దాదాపు సమానం కావడం గమనార్హం..! ఈ పరిస్థితులు ప్రభుత్వాన్ని గణనీయమైన ఒత్తిడికి గురిచేస్తాయని కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది.

**మూలధన వ్యయం 9 శాతమే**

సాధారణంగా భవనాలు, రోడ్లు, ప్రాజెక్టులు వంటివాటిని నిర్మించి, ఆస్తులను సృష్టించడానికి వెచ్చించే నిధుల మొత్తాన్ని మూలధన వ్యయంగా పరిగణిస్తారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం పెట్టిన మొత్తం వ్యయంలో ఈ మూలధన వ్యయం 9 శాతమేనని కాగ్ వెల్లడించింది. అంతకుముందు సంవత్సరం మూలధన వ్యయం కింద రూ.28,874 కోట్లను వినియోగిస్తే.. 2022-23లో 38% తగ్గుదలతో రూ.17,881 కోట్లను మాత్రమే ఖర్చు చేశారని గుర్తుచేసింది. గడిచిన ఐదేళ్లలో 2018-19లో మూలధన వ్యయం 18శాతంగా ఉన్నట్లు తెలిపింది.

**జీఎస్టీ కింద రూ.986 కోట్ల నష్టం**

వస్తు సేవల పన్ను(జీఎసటీ) వసూళ్లలో చోటు చేసుకున్న అక్రమాలు, అవకతవకల వల్ల ఐదేళ్ల కాలంలో ఖజానాకు రూ.986 కోట్ల నష్టం వాటిల్లినట్లు కాగ్ ఆక్షేపించింది. 2017-22 మధ్య ఐదేళ్ల కాలంలో పలు అక్రమాలు జరిగాయని తెలిపింది. ముఖ్యంగా పన్ను ఎగవేతలు, కొన్ని కేసుల్లో తక్కువ పన్నును వసూలు చేయడం, కొన్నింటిలో జరిమానాలు వసూలు చేయకుండా వదిలేయడం వల్ల నష్టపోయినట్లు వివరించింది.

**హైదరాబాద్‌కు నిధులేవి?**

హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని, 2020-21 నుంచి ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో భాగంగా 2020-21 బడ్జెట్‌లో మూసీ ప్రక్షాళన, మూసీ పరీవాహక ప్రాంత ప్రాజెక్టు, ఇతర పథకాల పేరిట రూ.10వేల కోట్లను ప్రతిపాదించింది. 2021-22లో కూడా రూ.2,600 కోట్లు, 2022-23లో రూ.200 కోట్లు కేటాయించినా.. ఆ నిధులను విడుదల చేయలేదంటూ కాగ్ తప్పు పట్టింది. పాతనగర మెట్రో మార్గానికి రూ.500 కోట్లు, విమానాశ్రయ మెట్రో మార్గానికి రూ.378 కోట్లు కేటాయించినా.. పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ మొత్తాన్ని ఉపసంహరించుకున్నట్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.11,000 కోట్లు కేటాయించి, అరకొరగా ఖర్చు చేసినట్లు గుర్తుచేసింది.

పదేళ్లలో అసలు, వడ్డీల కింద
ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లలో)

| సంవత్సరం | తీర్చాల్సిన అసలు | చెల్లించాల్సిన వడ్డీ | మొత్తం |
|---|---|---|---|
| 2023-24 | 9,341 | 20,825 | 30,166 |
| 2024-25 | 13,118 | 19,945 | 33,063 |
| 2025-26 | 15,850 | 18,842 | 34,692 |
| 2026-27 | 19,786 | 17,588 | 37,374 |
| 2027-28 | 17,050 | 16,102 | 33,152 |
| 2028-29 | 4,461 | 14,858 | 19,319 |
| 2029-30 | 2,449 | 14,541 | 16,990 |
| 2030-31 | 4,500 | 14,353 | 18,853 |
| 2031-32 | 7,311 | 14,032 | 21,343 |
| 2032-33 | 8,587 | 13,479 | 22,066 |
| మొత్తం | 1,02,453 | 1,64,565 | 2,67,018 |

# పేదోడి ఆలోచనకు అనుగుణంగా ఇండస్ట్రియల్ పార్కు

-మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటకు ఇన్స్‌రెన్సు, విత్తనాలకు సబ్సిడీ ఇస్తూ రైతులను రాజులుగా చేస్తున్నామని వెల్లడించారు. శనివారం నాడు భూపాలపల్లి జిల్లాలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క పర్యటించారు. గాంధీనగర్ ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. వనమహోత్సవం కార్యక్రమంలో మంత్రులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు కోరిన విధంగా భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇస్తామని తెలిపారు.

ఈ నెల చివరి వరకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన ప్రతి గ్రామానికి ఇస్తామని ఉద్ఘాటించారు. కేసీఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని ఇదిగో అదిగో అని మాయ మాటలు చెప్పి పదేళ్లలో కేవలం 1.50 లక్షల ఇళ్లను మాత్రమే కట్టిందని.. కానీ తమ ప్రభుత్వం మొదటి విడతలోనే 4.50 లక్షల ఇళ్లు కట్టిస్తుందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు ఎత్తలేదని, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం: మంత్రి సీతక్క**

భూపాలపల్లికి ఇండస్ట్రియల్ పార్క్ రావడం సంతోషకరమని మంత్రి సీతక్క తెలిపారు. ఉద్యోగాల వేటలో చాలా మంది



ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్నారని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో మారుమూల ప్రాంతాల్లో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. ఇండస్ట్రీస్ వల్ల భూపాలపల్లి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి ఎందరినో ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమాతను తెచ్చి విజయవంతంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్ తెచ్చామని చెప్పారు. స్కిల్ ఇండియా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఓకే సారి రూ. 2లక్షల రుణమాఫీ చేశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నేతలు అలా మాట్లాడటం సరికాదు: మంత్రి శ్రీధర్ బాబు**

ప్రభుత్వ బాధ్యతలు విస్మరించకుండా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. భూపాలపల్లి జిల్లాలో నీటి వనరులు, ఖనిజ సంపద ఉందని చెప్పారు. అశాస్త్రీయ బద్ధంగా మేడిగడ్డ బ్యారేజి కడితే కుంగిపోవడం ప్రజలంతా చూశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏదో కుట్ర చేసిందని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సరికాదని చెప్పారు. అధికారులను ప్రజల వద్దకు తీసుకెళ్లడం కోసం ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. మంత్రి సీతక్క , సీఎం రేవంత్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేస్తామంటే ప్రతిపక్షాలు విమర్శలు చేశాయని మండిపడ్డారు. ఈ రోజు కోటి మందిని స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులుగా చేర్చి మహిళలను లక్షాధికారులు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఎమ్మెల్యేలు ఇక్కడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో కష్టపడ్డారని అన్నారు. 200 పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. మొట్టమొదటి పరిశ్రమకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఐటీ రంగ ఉద్యోగులు కూడా జిల్లాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కావాలని కోరుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# నాలుగేళ్లుగా ఎదురు చూపులు

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి ఆ జిల్లా కలెక్టర్ ఆఫీసు నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31, 2020 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించిందని గుర్తుచేశారు. ఈ సమయంలో 25.70 లక్షల దరఖాస్తులు వచ్చాయని, గత నాలుగేళ్లుగా ఈ దరఖాస్తులు ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. మొత్తం 25.70 లక్షల దరఖాస్తుల్లో హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1.06 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో పరిధిలో 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల్లో 6 లక్షలు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటి పరిధిలో 1.35 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుదారుల సమస్యల పరిష్కారం కోసం నాలుగేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ దరఖాస్తులను అత్యంత ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకుసూచించారు.

**సిబ్బందిపై చర్చ...**

ఇందుకోసం, జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకోవాలని, ప్రతిపాదనలు పంపిస్తే రెవెన్యూ శాఖ నుంచి సిబ్బందిని సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులపై జారీచేసిన నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు అన్ని జిల్లా కలెక్టరేట్‌లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్




అథారిటీ, మున్సిపాలిటీలు మినహా మిగిలిన ప్రాంతాల దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**వెంటనే కార్యాచరణ చేపట్టాలి..**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో భాగస్వాములయ్యే అన్ని స్థాయిల సిబ్బంది, అధికారులకు తక్షణమే శిక్షణ చేపట్టాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ విధివిధానాలను విడుదల చేసిన నేపథ్యంలో అమలుకు అవసరమ్కెన కార్యాచరణను వెంటనే చేపట్టాలని, జిల్లా కలెక్టర్‌లు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఏడు జిల్లాల్లో అత్యంత విలువైన భూములు ఉన్నాయని ఈ జిల్లాల్లో లే అవుట్ల క్రమబద్ధీకరణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. వారి ఆస్తులకు చట్టపరమైన గుర్తింపుతో సహా ఆమోదించిన లే అవుట్ల ద్వారా అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఆమోదించిన లేఅవుట్ యజమానులు, ఇంటి నిర్మాణాలకు భవన నిర్మాణ అనుమతులు పొందేందుకు, బ్యాంకు రుణాలు పొందేందుకు, కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి సహాయపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## మాజీ సీజేఐ రమణతో మందకృష్ణ భేటీ

-మొదటిపేజీ తరువాయి

విషయాలపై ఆయన సలహాలను మందకృష్ణ కోరారు. ఇక ఇప్పుడు రాష్ట్రాల్లో పోరాటాలు చేయాలని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. ఈ సందర్భంగా ఎన్వీ రమణకు మందకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సీజేఐగా ఉన్నప్పుడే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ చేసిన మూడు దశాబ్దాల పోరాటాన్ని మాజీ సీజేఐ అభినందించారు.

## ఐఏఎస్‌లకు స్థానచలనం..

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీకి వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు-భవనాల శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్.హరీశ్ రెవెన్యూ శాఖలోని విపత్తుల విభాగం సంయుక్త కార్యదర్శిగా బదిలీ అయ్యారు. వ్యవసాయ, సహకార శాఖ సంయుక్త కార్యదర్శి పి.ఉదయ్‌కుమార్‌కు మార్కెటింగ్ శాఖ సంచాలకులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంకను పురపాలక శాఖ ఉప కార్యదర్శిగా బదిలీ చేశారు. సహకార శాఖ సంయుక్త రిజిస్ట్రార్, నాన్ ఐఏఎస్ కె.చంద్రశేఖర్‌రెడ్డిని బదిలీ చేసి హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. వరంగల్ వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ శ్రీనివాసరెడ్డిని మార్క్‌ఫెడ్ ఎండీగా నియమించారు.

## సుప్రీంతీర్పు ఎవరికీ వ్యతిరేకం కాదు



-మొదటిపేజీ తరువాయి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయవాదిని నియమించి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిందని తెలిపారు. 600 పేజీల తీర్పును మేధావులు పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందిస్తే.. కమిటీవేసి పూర్తిస్థాయిలో చర్చించి ఆర్డినెన్స్‌కు చర్యలు చేపడుతుందని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే తీర్పు తొలుత అమలుకానున్నదని, మాదిగజాతి కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటుందని తెలిపారు. ఈ నెల 16 లేదా 17 తేదీల్లో మాదిగల సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం చర్యలు చేపట్టిందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తెలిపారు. వర్గీకరణపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి ఆ ప్రతిని మోదీకి అందించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 70 లక్షల జనాభా ఉన్న మాదిగజాతి ఎటు ఓటు వేస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని, తద్వారా హక్కులను సాధించుకోవాలని సూచించారు. తాను లీడర్‌గా తయారుచేసిన మొదటి వ్యక్తి మంద కృష్ణ అని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వీరేశం, సామేలు, లక్ష్మీకాంతారావు, సత్యనారాయణ, యాదయ్య, మాజీ మంత్రి పుష్పలీల, నాయకులు సంపత్‌కుమార్, పిడమర్తి రవి, ప్రొఫెసర్ కాశీం, రాష్ట్ర దళిత ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రాహుల్.. అశోక్‌నగర్ వచ్చి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో యువతకు చెప్పండి

**హైదరాబాద్‌శుభ తెలంగాణ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. రాహుల్ గాంధీ జీ.. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మీ మాటలు నమ్మి తెలంగాణ యువత కాంగ్రెస్‌కు ఓటేశారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైనా ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు సున్నా. ఎన్ని ఉద్యోగాలో చెప్పకుండా జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. మరోసారి హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చి యువతను కలిసి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో చెప్పండి?.. అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్‌కు వచ్చి యువతతో మాట్లాడుతున్న వీడియోను షేర్ చేశారు. కాగా, శుక్రవారం రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. పోస్టుల సంఖ్య లేకుండా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తొమ్మిది నెలల కిందట ఉద్యోగాల పేరిట ఎంత డ్రామా చేసింర్రు..కేసీఆర్ అసలు ఉద్యోగాలే ఇవ్వలేదన్నట్టు తప్పుడు ప్రచారం చేసింర్రు. అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలని పత్రికల్లో ఊదరగొట్టే విధంగా అక్రమ సంపాదనతో కాంగ్రెస్ నాయకులు ప్రకటనలిచ్చింర్రు. రాహుల్ గాంధీని అడుగుతున్న, నువ్వు ప్రామిస్ చేసిన రెండు లక్షల ఉద్యోగాలేవీ?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. క్యాలెండర్‌లో తేదీలు మారుతున్నాయని, మరి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఏవని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ వాళ్లు బయట కనబడితే నిరుద్యోగులు తన్నితరిమేసే పరిస్థితి ఉన్నదని దుయ్యబట్టారు. అందుకే నాలుగు కాగితాల మీద ఏది పడితే అది రాసుకొచ్చారని, అది జాబ్ క్యాలెండర్ అని ప్రకటించారని ఆక్షేపించారు. జాబ్ క్యాలెండర్ నిజమైతే అందులో రెండు లక్షలు కాదు రెండు ఉద్యోగాలు కూడా ఎందుకు పెట్టలేదని నిలదీశారు. దమ్ముంటే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అశోక్‌నగర్‌కు రావాలని, తామంతా అక్కడికి వస్తామని కేటీఆర్ వారికి సవాల్ విసిరారు.

## మహిళలకు కీలక ప్రకటన...

తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ముదిగొండ మండలం కమలాపురంలో మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టి మాట్లాడుతూ... మధిర నియోజకవర్గంలో కొద్ది రోజుల్లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. అంగన్ వాడీలో 3 వ తరగతి వరకు ఏర్పాటు చేసి నాల్గోతరగతికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలుకు పంపించే ఏర్పాటుకు నాంది పలికామని అన్నారు.

**ఇందిరమ్మ డైరీని ప్రవేశ పెట్టాం..**

అలాంటి పాఠశాలలు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ డైరీ చిరకాల కోరిక అని వివరించారు. నియోజకవర్గంలోని మహిళలను పాడి పరిశ్రమలో వాటాదారులుగా చేసి వారిని పారిశ్రామిక వేత్తలుగా చేయడానికి 2014కు ముందే ఇందిరమ్మ డైరీని ప్రవేశ పెట్టామని వెల్లడించారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు గేదెలు ఇచ్చి వారిని పరిశ్రమలో వాటా దారులుగా చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా ఆర్థికమంత్రిగా బడ్జెట్ ప్రవేశ పెట్టామని తెలిపారు. నియోజకవర్గంలో మిగిలిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు త్వరలోనే ప్రారంభిస్తామని మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.



# యవ్వనంగా మెరిసిపోవాలా?

కొందరు 40 ఏండ్ల వయస్సులోనే 20 ఏండ్ల వ్యక్తిలా కనిపిస్తుంటారు. ముఖంలో యవ్వన ఛాయ ఉట్టిపడుతూ ఉంటుంది. ఇంకొందరు 25 ఏండ్లకే 40 ఏండ్ల వ్యక్తిలా కనిపిస్తుంటారు. ముఖంలో వృద్ధాప్య ఛాయలు దర్శనమిస్తుంటాయి. అయితే జన్యుపరమైన అంశాలు, ఆహారపు అలవాట్లు కూడా ఇందుకు కారణం అవుతుంటాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. ఎక్కువ ఏజ్ వచ్చినా తక్కువ ఏజ్ వ్యక్తిలా యవ్వనంగా కనిపించాలంటే.. కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం. అధిక చక్కెర, శుద్ధి చేసిన ఆహారాలు : కృత్రిమ చక్కెరలు, అలాగే అధిక చక్కెరలు కలిగిన ఆహారాలు తరచుగా తినడంవల్ల చర్మంలో వృద్ధాప్య ఛాయలు త్వరగా కనిపించే అవకాశం ఉటుందని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే ఈ అవాటు రక్తంలో షుగర్ లెవల్స్ పెంచుతుంది. ఎప్పుడైనా అది పెరుగుతుందో వృద్ధాప్య ఛాయలు చర్మంపై కనిపించడం మొదలవుతాయి. కాబట్టి అధిక చక్కెరలకు దూరంగా ఉండటం బెటర్. ఆల్కహాల్ వద్దు : మద్యపానం అలవాటు ఉన్నవారిలో మిగతా వారితో పోల్చినప్పుడు వృద్ధాప్యం త్వరగా వచ్చే చాన్సెస్ ఉంటాయని నిపుణులు అంటున్న మాట. ఎందుకంటే ఇది డెడ్ స్కిన్ సెల్స్‌ను పెంచుతుంది. తరచుగా చర్మాన్ని డీహైడ్రేషన్ పరిస్థితిలోకి నెడుతుంది. ఇది వేగవంతమైతే చిన్న వయస్సులో కూడా వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. ఎక్కువకాలం యవ్వనంగా ఉండాలంటే మద్యపానం అలవాటు మానుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రాసెస్ చేసిన స్నాక్స్: అధిక చక్కెరలు కలిగిన, అధికంగా వేయించిన ప్యాకేజ్డ్ అండ్ ప్రాసెస్డ్ స్నాక్స్ వల్ల కూడా బ్లడ్‌లో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. ముఖంపై యవ్వన ఛాయలు త్వరగా మాయం అవుతాయి. వృద్ధాప్యం త్వరగా వస్తుంది. కాబట్టి వాటిని అవైడ్ చేయండి. హెల్తీ ఫ్యాట్స్ : కొన్ని రకాల కొవ్వు పదార్థాలు వృద్ధాప్య ఛాయలను పెంచుతాయి. ఆయిలీ ఫుడ్స్, అధికంగా వేయించిన పదార్థాల్లో బ్యాడ్ కొలెస్ట్రాల్ లేదా హై కొలెస్ట్రాల్ ఉంటుంది. వీటిని అవైడ్ చేస్తూ గుడ్ కొలెస్ట్రాల్ ఉండే తాజా పండ్లు, కూరగాయలు, గింజలు, అవకాడో వంటివి ఆరోగ్యకరమైన కొవ్వులను తీసుకోవడంవల్ల ఏజింగ్ లక్షణాలు ఆలస్యం అవుతాయి. అలాగే సమతుల్యమైన ప్రోటీన్ ఫుడ్ తీసుకోవడం, అధిక కెఫిన్‌కు, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండటం వంటివి చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వృద్ధాప్య ఛాయలను ఆలస్యం చేస్తాయి. చర్మంలో యవ్వన ఛాయను ప్రేరేపిస్తాయి.

# పిండికి పురుగులు ఎందుకు పడతాయి?



మనం తీసుకునే ఆహారంలో రొట్టెలు ఆరోగ్యానికి చాలా మంచిదని పోషకాహార నిపుణులు చెప్తుంటారు. ముఖ్యంగా తైద, జొన్న, గోధుమ వంటి ధాన్యాలను గ్రైండ్ చేసి పిండిగా మార్చడం ద్వారా రొట్టెలను తయారు చేస్తారన్న విషయం తెలిసిందే. వీటిలో తైదల నుంచి వచ్చే పిండి హెల్త్‌కి ఇంకా మంచిదని, తైద రొట్టెలు తరచుగా తినేవారిలో బీపీ, షుగర్ వంటివి రాకుండా ఉంటాయని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. అయితే పిండిని సక్రమంగా భద్రపర్చుపోవడంవల్ల పురుగులు పడుతుంటాయి. అలా జరగకూడదంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. తైదలు, జొన్నలు ఇలా ఏ ధాన్యాలైనా పిండిగా మార్చడానికి గ్రైడింగ్ చేస్తారు. కొందరు మార్కెట్ నుంచి తెచ్చిన వాటిని బాగానే ఉంటాయని డైరెక్టుగా గ్రైండ్ చేస్తుంటారు. దీనివల్ల పిండి పురుగులు పట్టే చాన్స్ ఉంటుంది. అలా జరగవద్దంటే ముందుగా వాటిని నీటితో కడిగి ఎండలో ఆరబెట్టాలి. బాగా ఎండిన తర్వాత మాత్రమే పిండి పట్టించాలని, లేకపోతే ఫంగస్ పేరుకుపోయి పిండి త్వరగా పాడవుతుందని నిపుణులు చెప్తున్నారు. పిండిని, ముఖ్యంగా తైద పిండిని ఏదైనా పాత్రలో లేదా కంటైనర్‌లో పెట్టినప్పుడు గాలి తగలకుండా దానికి మూకుడు పెట్టాలి. సరిగ్గా పెట్టకపోయినా, తేమ చేరే పరిస్థితిలో ఉంచినా పురుగులు పడతాయి. గాలి చొరబడే కంటైనర్‌లో ఉంచడంవల్ల ఆక్సీకరణ పెరిగి తైద పిండి మరింత త్వరగా పాడవుతుంది. వేడి ఎక్కువగా ఉండే ప్రదేశంలో పెట్టడంవల్ల తైద, జొన్న, గోధుమ ఏ పిండి అయినా త్వరగా పురుగులు పడుతుంది. ఎక్కువరోజులు నిల్వ ఉండాలంటే కంటైనర్‌లో వేసి, మూత పెట్టిన తర్వాత ఒకే విధమైన సాధారణ ఉష్ణోగ్రత ఉండే ప్రదేశంలో లేదా చల్లని ప్రదేశంలో స్టోర్ చేయాలి. అలా కాకుండా కాసేపు చల్లగా, మరి కాసేపు వేడిగా మారే వాతావరణంలో ఉంచితే పాడవుతుంది. అలాగే గదిలో కిటికీల పక్కన స్టోర్ చేయడంవల్ల కూడా కిటికిల్లోంచి బయటి వాతావరణ ప్రభావంవల్ల పిండి త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి నార్మల్ వెదర్ ఉండే ప్రదేశంలో స్టోర్ చేయాలి. ఈ విధమైన జాగ్రత్తలతో పిండికి పురుగులు పట్టకుండా ఎక్కువ రోజులు వినియోగించుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

# మనిషి మద్యానికి ఎందుకు బానిస!



మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం అంటారు. కానీ చాలా మంది అవి ఏవి పట్టించుకోకుండా ఎక్కువగా డ్రింక్ చేస్తుంటారు. అయితే కొంత మంది పార్టీలు, ఫంక్షన్స్ టైమ్‌లో ఎక్కువ మద్యం సేవిస్తే, ఇంకొంత మంది ప్రతి రోజూ మద్యం తాగుతూనే ఉంటారు. ముఖ్యంగా కొంత మంది విపరీతంగా మద్యానికి అడెక్ట్ అవుతుంటారు. అసలు మరి ఈ ఆల్కహాల్ వ్యసనంలా ఎలా మారుతుంది. దీనికి ఎందుకు వ్యక్తులు ఎక్కువగా అడెక్ట్ అవుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. లండన్ కింగ్స్ కాలేజ్ పరిశోధకులు ఓ సర్వే చేశారు. ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఒక అధ్యయాన్నిప్రచురించిగా అందులో షాకింగ్ విషయాలు వెల్లడి అయ్యాయి. ఆర్ఎఎస్జిఆర్ఎఫ్2 అనే జన్యువు ప్రజలను మద్యపాన ఆనందాన్ని ప్రభావతం చేస్తుందంట. దీని వలన వ్యక్తి మద్యపానం పదే పదే తాగాలనిపిస్తే, వ్యసనంలా మారుతుందంట. అంతే కాకుండా మన మెదడులో ఉండే ఆనందంతో సంబంధం ఉన్న న్యూరోట్రాన్స్మిటర్ మనకు రుచికరమైన, నచ్చిన ఫుడ్ తిన్నప్పుడు డోపామైన్ స్థాయిలు పెరిగి పోయేలా చేస్తుంది. దీంతోఅదే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. అలా మద్యం సేవించేటప్పుడు కూడా డోపామైన్ స్థాయిలు పెరిగిపోయి, కొందరు మద్యానికి వ్యసనంలా మారిపోతున్నారంట.

# డేటింగ్ కల్చర్‌పై యువతలో పెరుగుతున్న ఇంట్రెస్ట్

రిలేషన్‌షిప్‌లోకి అడుగు పెట్టడమే కాదు, తమ బంధం బలంగా, రొమాంటిక్‌గా ఉండాలని చాలామంది కోరుకుంటారు. అందుకోసం పార్ట్‌నర్ చేసే చిన్న చిన్న పనులను కూడా గమనించడం, అభినందించడం, పరస్పరం సహకరించుకోవడం వంటివి ఇక్కడ ప్రయారిటీ అంశాలుగా ఉంటాయని, డేటింగ్ కల్చర్‌లో దీనినే 'గ్రీన్ ఫ్లాగ్స్' అంటారని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఆత్మవిశ్వాసం:** బంధం బలంగా ఉంటూ.. రొమాంటిక్ రిలేషన్‌షిప్ సవ్యంగా కొనసాగాలంటే.. పార్ట్‌నర్‌లో ఆత్మ విశ్వాసం కూడా నిండుగా ఉండాలని ఈ జనరేషన్ కోరుకుంటోంది. ఎందుకంటే సెల్ఫ్ కాన్ఫిడెంట్ ఉన్నవాళ్లు తమను ఎవరైనా తమను జడ్జ్ చేస్తారేమోనని అస్సలు భయపడరని నిపుణులు చెప్తున్నారు. పైగా తమ ఫీలింగ్స్‌ను స్వేచ్ఛగా బయట పెడతారు. అదీగాక ఆత్మ విశ్వాసం కలిగిన పార్ట్‌నర్ వల్ల తాము సురక్షితంగా ఉంటామని చాలామంది భావిస్తారట. అందుకే ఈ జనరేషన్ వాళ్లు తమ భాగస్వామిలో సెల్ఫ్ కాన్ఫిడెంట్ ఉండాలని కోరుకుంటున్నారు.

**ఫీలింగ్స్ క్యాచ్ చేయడం:** ఏ ఇద్దరి అభిప్రాయాలు ఒకేలా ఉండవు. కానీ ఎదుటి వ్యక్తి అభిప్రాయాన్ని గౌరవించడం, ఫీలింగ్స్ క్యాచ్ చేయడం వంటివి తమ పార్ట్‌నర్‌లో ఉండాలని ఈరోజుల్లో చాలామంది కోరుకుంటున్నారు. చెప్పేది విని అర్థం చేసుకోవడం, అవతలి నుంచి కూడా అదే విధమైన శ్రద్ధ కనబర్చడం వంటి ప్రవర్తన బంధాన్ని బలోపేతం చేస్తుందని ఈతరం భావిస్తున్నట్లు రిలేషన్‌షిప్ నిపుణులు చెప్తున్నారు.

**గుడ్ కమ్యూనికేషన్:** రిలేషన్‌షిప్‌లో కమ్యూనికేషన్ కీలకపాత్ర పోషిస్తుంది. అంతేకానీ ఒకరి గురించి ఏమీ తెలియకుండా, పరిస్థితిని అర్థం చేసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, ఎదుటి వ్యక్తిని తమ ఆసక్తులకు అనుగుణంగా జడ్జ్ చేయడం ఎవరికీ నచ్చదు. ఇది అర్థం చేసుకోవడంతోపాటు పార్ట్ నర్‌తో ప్రేమగా, గౌరవంగా మాట్లాడటం, భావాలను నిజాయితీగా చెప్పడం, అభిప్రాయ భేదాలు తలెత్తితే కలిసి మాట్లాడుకొని పరిష్కరించుకోవడం వంటివిన్నీ రిలేషన్ షిప్‌లో గుడ్ కమ్యూనికేషన్ కిందికి వస్తాయి. ఈ రోజుల్లో ఇది చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు.

**ఒత్తిడి నుంచి ఉపశమనం వరకు:** మీరు ఒత్తిడిలో ఉన్నప్పుడు ఎదుటి వ్యక్తి మాటలు, ప్రవర్తన దానినుంచి బయటపడేసేలా ఉండాలి. కానీ మరింత ఒత్తిడికి గురిచేసేలా ఉండకూడదు. రిలేషన్‌షిప్‌లో ఇది చాలా ముఖ్యమని నేటి యువత భావిస్తోంది. తాము ఎంపిక చేసుకోబోయే భాగస్వామిలో కూడా ఆ లక్షణాలు ఉండాలని కోరుకుంటోందని నిపుణులు చెప్తున్నారు. అలాగే ఏదైనా సమస్య వచ్చినప్పుడు అది వ్యక్తిగత సమస్య అయినప్పటికీ పార్ట్‌నర్ పట్టించుకోగలగాలి. మనసు తెలుసుకొని మసలు కోవాలి. సలహాలు సూచనలు ఇవ్వడం, కలిసి పరిష్కారం వెతకడం వంటివి చేయాలి. ఇది స్ట్రాంగ్ రిలేషన్ షిప్‌కి ముఖ్యమని నిపుణులు చెప్తున్నారు.

**బాధల్లో, భావోద్వేగాల్లో సపోర్ట్‌గా..:** జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కష్టాలు, నష్టాలు, బాధలు, భావోద్వేగాలు వస్తుంటాయి. అలాగని అవి శాశ్వతం కాదు. సంతోషాలు, సరదాలు వంటి అంశాల్లో భాగస్వామికి ఎలా సపోర్టుగా ఉంటారో, బాధలో ఉన్నప్పుడు, భావోద్వేగాలకు లోనైనప్పుడు కూడా అలాగే ఉండాలని నేటి యువత కోరుకుంటున్నట్లు రిలేషన్‌షిప్ అండ్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిపుణులు చెప్తున్నారు. పైన



పేర్కొన్న ఐదు లక్షణాలు కలిగిన వ్యక్తిని పార్ట్‌నర్ పొందాలనే ఆసక్తిని నేటి డేటింగ్ కల్చర్‌లో ముఖ్యమైన 'గ్రీన్ ఫ్లాగ్స్'గా పేర్కొంటున్నారు.

# జిల్లాలో విద్యార్థులకు ఇబ్బంది కల్గించిన, ర్యాగింగ్ చేసిన కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటాం....







–జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి,

**వికారాబాద్, శుభ తెలంగాణ:** శనివారం జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి జిల్లాలో పని చేస్తున్నా షీ టీం, భరోసా సెంటర్ మరియు కళాజాత బృందం అధికారులతో సమన్వయ సమావేశం లో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో షీ టీం, కళాజాత బృందం మరియు భరోసా కేంద్రం సమన్వయము తో కలసి పని చేయాలి.అధికారులు అందరు అవగాహనా కార్యక్రమాలలో పాల్గొని ఎవరైన మహిళలను, బాలికలను ఇబ్బందులకు గురిచేస్తే తమ కోసం షీ అధికారులు ఉన్నారు అని ఎవరైనా లైంగిక వేధింపులకు గురి అయితే భరోసా అధికారులు ఉన్నారనే విషయాన్నీ జిల్లాలోని ప్రతి గ్రామ గ్రామా ప్రజలకు తెలియజేసే విధంగా అవగాహనా కార్యక్రమాలు చేయాలనీ, తమ కోసం షీ టీం మరియి భరోసా కేంద్రాలు పని చేస్తున్నాయి అనే విషయం ప్రతి ఒక్కరు తెల్సుకోవాలని, ఎవరైనా ఏదైనా ఇబ్బందులకు గురి అయినా వెంటనే పోలీస్ అధికారులకు గాని, షీ టీం, భరోసా అధికారులకు గాని తెలియజెస్తే వారి వివరాలు కూడా గొప్యంగా ఉంచడం జరుగుతుంది.కానీ ఎవ్వరు కూడా ఎలాంటి ఆత్మహత్యలు చేసుకోవద్దు. జిల్లాలో ఎవరైనా ఆడపిల్లల జోలికి వెళితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని, అదేవిధంగా ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ లకు పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్పీ తెలియజేసినారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ %ఖ%.రవీందర్ రెడ్డి , ( డిస్ట్రిక్ట్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ ) ప్రశాంత్ రెడ్డి , షీ టీం, భరోసా మరియు కళాజాత బృందం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల క్రమబద్ధీకణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో

# అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి...







–జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, శుభ తెలంగాణ:** సరళీకృత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ తో పాటు ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో సరళీకృత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు అందించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... జిల్లాలోని మున్సిపల్, గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారిదర్శకంగా చేపట్టాలన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో 20968, గ్రామపంచాయతీల పరిధిలో 12745 క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కార దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా కమిటీలను రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్రమబద్ధీకరణ క్రమంలో తప్పని సరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూముల క్రమబద్ధీకణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారుల సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డిపిఓ జయసుధ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా వికారాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం...






**–41 అంశాలతో కూడిన ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు..**

**–కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు 41 అంశాలతో కూడిన ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే మున్సిపల్ లోని వివిధ వార్డులలో ఉన్న సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తీసుకురావడంతో పాటు పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య సమస్యలపై సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం జరిగింది. మున్సిపల్ సాధారణ సమావేశం అనంతరం చైర్ పర్సన్ చాంబర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్ పర్సన్ మంజుల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి మరియు వికారాబాద్ శాసనసభ్యులు గౌరవ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపల్ ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని అన్నారు. పట్టణ అభివృద్ధి పట్ల సుదీర్ఘ సమయం చర్చించి సహకరించిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు అందరికీ చైర్ పర్సన్ గారు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈనెల ఆగస్టు 5వ తారీఖు నుంచి ఆగస్టు 9వ తారీకు వరకు ప్రతిరోజు ఒక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చైర్ పర్సన్ వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి, కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మహీంద్రా గ్రూప్ పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చ.



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో మహీంద్రా గ్రూప్, మహీంద్రా – మహీంద్రా లిమిటెడ్, టెక్ మహీంద్రా లిమిటెడ్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా మర్యాదపూర్వక భేటీ. రాష్ట్రంలో మహీంద్రా గ్రూప్ పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చ. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని అడాప్ట్ చేసుకునేందుకు అంగీకరించిన ఆనంద్ మహీంద్రా. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిశీలనకు తమ టీమ్ ను పంపుతామని వెల్లడించిన ఆనంద్ మహీంద్రా. హైదరాబాద్ లో క్లబ్ మహీంద్రా హాలీడే రిసార్ట్ విస్తరణకు ముందుకు వచ్చిన ఆనంద్ మహీంద్రా.

## ధరణి పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి పనులను వేగవంతం చేయాలి..

–జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, శుభ తెలంగాణ:** ధరణి పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయాన్ని, మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలోని ధరణి సహాయక కేంద్రాన్ని, రికార్డు గదిని కలెక్టర్ పరిశీలించారు.
ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ తెలిపారు. చికిత్స నిమిత్తం వచ్చిన బాలుడి అనారోగ్యంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటనలో ఆర్డీవో వాసు చంద్ర, డిఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, తహసిల్దార్ లక్ష్మీనారాయణ లు ఉన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు భూ సేకరణకు రైతులు సహకరించాలి...

**–జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





**వికారాబాద్, శుభ తెలంగాణ:** అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధి అథారిటీ కింద అభివృద్ధి పనులను చేపట్టేందుకు భూసేకరణ నిమిత్తం శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అప్పాయిపల్లి రైతులతో సమావేశాన్ని నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా రైతులకు ఎకరాకు 125 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ లేఅవుట్ అభివృద్ధి చేసి ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వైద్య (నర్సింగ్) కళాశాల, పశు వైద్య శాలల ఏర్పాటుతో ప్రాంత అభివృద్ధితో పాటు విద్యార్హత మేరకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. ఉద్యోగ కల్పనలో ఎలాంటి సందేహాలు వుండకూడదని కలెక్టర్ తెలిపారు. ప్రాంత అభివృద్ధి మూలంగా వ్యాపార పరంగా స్థానికులకు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను మెమోరండం ద్వారా తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, పశు సంవర్ధక అధికారి పూర్ణ చంద్ర రావు, డిసీహెచ్ఎస్ ప్రదీప్ కుమార్, కొడంగల్ తహసీల్దార్ విజయ కుమార్ లు పాల్గొన్నారు.

## 70 ఏళ్లు... 70అడుగులు


# ఖైరతాబాద్ గణేష్

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** హైదరాబాద్‌లో ది ఫేమస్ ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహ తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి లంబోదరుడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. అయితే ఖైరతాబాద్ గణేషుడు రికార్డ్‌లకు కేరాఫ్‌గా మారాడు. ఈసారి కూడా హైట్‌లో తన పేరు మీదున్న రికార్డును తానే బ్రేక్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. 70 అడుగుల ఎత్తులో? ఈ ఏడాది సప్తముఖ గణేశుడి రూపంలో దర్శనమివ్వబోతున్నాడు. పూర్తిగా మట్టితో మహాగణపతి విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు కోటి రూపాయల ఖర్చుతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖైరతాబాద్ గణేశుడికి ఇరువైపులా.. శివపార్వతులు, శ్రీనివాసుల కల్యాణ మండపం.. ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య బాలరాముడి విగ్రహం ఉంటాయి.ఖైరతాబాద్ గణేషుడికి సుమారు ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది. 1954లో సింగరి శంకరయ్య అనే స్థానిక భక్తుడు స్థానిక ఆలయంలో ఒక అడుగు ఎత్తున్న గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి సామూహిక పూజలు చేశారు. అలా.. 2014 వరకు ప్రతి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ విగ్రహాన్ని తయారు చేశారు. 2019లో 61 అడుగుల ఎత్తున్న గణపతిని తయారు చేయగా.. భారతదేశంలోనే అత్యంత ఎత్తైన విగ్రహంగా రికార్డులకెక్కింది. అప్పటినుంచి విగ్రహం ఎత్తు మళ్లీ క్రమంగా తగ్గించడం మొదలు పెట్టారు. దాంతోపాటు.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహానికి గుడ్ బై చెప్పి.. మట్టి గణపయ్యకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే.. గతేడాది (2023) పూర్తి మట్టితో 63 అడుగుల అత్యంత ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. గత సంవత్సరం కంటే 7 అడుగులు ఎక్కువ ఎత్తుతో కమిటీ నిర్వహకులు మొత్తం 70 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు.




# ధరణి... ఇక భూమాత

**హైదరాబాద్ :** ధరణి పోర్టల్ పేరును భూమాతగా మారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ధరణి పోర్టల్ సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. ధరణీతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ...ధరణీ చట్టం మూడు తలలతో మొదలై.. 33 తలలతో అవతరించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు భట్టి విక్రమార్క గారు ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సమయంలో ఎక్కడికి వెళ్లినా ధరణీ సమస్యల గురించే ప్రజలు ఆయనకు వివరించారన్నారు. ధరణీని బంగాళఖాతంలో వేస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని గుర్తు చేసారు. ధరణి చట్టం ఇద్దరు వ్యక్తులు కూర్చుని చర్చించుకుని తెచ్చిన చట్టమని.. ధరణీతో సామాన్యులు అవస్థలు పడ్డారని పొంగులేటి తెలిపారు. ధరణీ వచ్చిన తరువాత ప్రతీ గ్రామంలో సమస్యలే ఉన్నాయన్నారు. అప్పటి సర్కార్ పెద్దలు ధరణీ పేరుతో ప్రజలకు దగా చేశారన్నది ముమ్మాటికి నిజమన్నారు. ధరణీ సమస్యలతో రైతులు రోడ్డున పడ్డారు. చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేసారు. సాదా బైనామాలకు నోటిఫికేషన్ ఇచ్చి ధరణీలో ఆ కాలమే పెట్టలేదని మండిపడ్డారు. 18 లక్షల ఎకరాల భూమిని పక్కకు పెట్టారని అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. 2014 లో కేసీఆర్ ధరణి తెచ్చారు అప్పట్నుంచి కొండ నాలుక కి మందు వేస్తే?ఉన్న నాలిక పోయినట్టు ఉంద్నారు. భూసంస్కరణలకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ శ్రీకారం చుట్టారని భూ సంస్కరణలతో అనేక విషయాలు అనుసంధానమై ఉన్నాయన్నారు. ప్రధానిగా ఉన్నప్పుడు పీవీ కూడా భూ సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. ధరణి నీ ఐఎల్ ఎఫ్ కంపెనీకి అప్పగించారంచారని.. అది దివాలా తీసిన కంపెనీ అన్నారు. ఆ కంపెనీ సింగపూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారని.. సింగపూర్ కంపెనీ కి తెలంగాణ భూములు తాకట్టు పెట్టారని పొంగులేటి ఆరోపించారు. ధరణి తో గుంట భూమి కూడా అమ్ముకోలేని పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ధరణి పోర్టల్ రద్దు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ. అధికారంలో రాగానే ధరణి సమస్యలపై అధ్యయనం కోసం కమిటీనీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇటీవల కొన్ని సిఫారసులు చేసినట్లుగా తెలుస్తోంది. ఆ సిఫారసుల మేరకు.. ధరణి పోర్టల్ భూమాతగా మార్చి.. సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.




# రేవంత్ రెడ్డిపై తీన్మార్ మల్లన్న తిరుగుబాటా...

**వరంగల్ :** "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తిరుగుబాటు చేశారా? బీసీ కులాల వారిని రేవంత్ చిన్న చూపు చూస్తున్నారా? గతంలో తీన్మార్ మల్లన్న చేసిన విజ్ఞప్తులను ఆయన బుట్ట దాఖలు చేశారా? అందువల్లే తీన్మార్ మల్లన్న లో ఆగ్రహం కట్టలు తెంచుకుందా? త్వరలో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయబోతున్నారా? ఈ ప్రశ్నలకు స్వయంగా ఔను అనే సమాధానం చెబుతున్నారు తీన్మార్ మల్లన్న. హైదరాబాదులో మంగళవారం హోటల్ తాజ్ కృష్ణ లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఇదే సమావేశానికి మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, జస్టిస్ ఈశ్వరయ్య వంటి వారు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అది మీడియాలో ప్రముఖంగా రావడంతో ఒక్కసారిగా చర్చకు దారితీసింది. రేవంత్ రెడ్డి త్వరలో అమెరికా పర్యటనకు వెళుతున్న నేపథ్యంలో తీన్మార్ మల్లన్న ఆ వ్యాఖ్యలు చేయడం కలకలం రేపుతోంది.పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక వచ్చింది. ఎన్నికలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్న భారత రాష్ట్ర సమితి బలపరిచిన అభ్యర్థి అనుగుల రాకేశ్ రెడ్డి పై విజయం సాధించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత పలుమార్లు ఆయన రేవంత్ రెడ్డిని కలిశారు. అయితే ఆ మధ్య ప్రభుత్వం అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పదవులను భర్తీ చేసింది. ఆ పదవులు రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చింది. అయితే ఆ పదవులను బీసీ కులాల వారితో భర్తీ చేయాలని తీన్మార్ మల్లన్న రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారట. అయితే ఆ విజ్ఞప్తిని రేవంత్ రెడ్డి తోసిపుచ్చారట. బిసి కులాలకు ఆ పదవులు ఇచ్చేంత ఆసక్తి తనకు లేదని రేవంత్ చెప్పారట. అదే విషయాన్ని బీసీ కులాల సమావేశంలో తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. "ఇదెక్కడ అన్యాయం.. అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టులను బీసీ కులాలతో భర్తీ చేయాలని కోరితే పట్టించుకోలేదు. ఇలాంటి విధానం సరికాదు. నేను రేవంత్ రెడ్డికి ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా. అవసరమైతే నా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తా. బీసీ కులాల అభ్యున్నతే నా లక్ష్యమని" తీన్మార్ మల్లన్న ప్రకటించారు. బీసీల కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని మల్లన్న అన్నారు. బీసీలను విస్మరిస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఇక ఈ సమావే శానికి మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్ మధుసూ దనా చారి హాజరయ్యారు.. బీసీ కులాలు రాజ్యాధికారానికి దూరంగా ఉంటున్నాయని.. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారాన్ని చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు ఇన్నాళ్లకు బీసీ కులాలు గుర్తొచ్చాయని.. బీసీ కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కేవలం తెలంగాణలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అలా గణన చేపట్టిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని.. దేశ జనాభాలో 70 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాలలో సింహ భాగం దక్కాలని వారు కోరారు.తీన్మార్ మల్లన్న ఒక్కసారిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై సంచలన వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది."తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత విద్యాశాఖ మంత్రి అడిగారు. అయితే దానికి రేవంత నో చెప్పారు. అందువల్లే తీన్మార్ మల్లన్న యూటర్న్ తీసుకున్నారు. రేవంత్ రెడ్డిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. అయితే ఇలాంటి బెదిరింపులకు రేవంత్ రెడ్డి భయపడరు. ఇలాంటి వాళ్లను ఆయన రాజకీయ జీవితంలో ఎంతో మందిని చూశారు. బీసీల అభ్యున్నతి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చాలా చేస్తోంది. ఆ విషయం తెలియకుండా మల్లన్న ఏదేదో మాట్లాడారు. ఆ విషయం ఆయన వ్యక్తిగతం. దానికి కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని" హస్తం పార్టీ నాయకులు సామాజిక మాధ్యమ వేదికలలో వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టుల్లో బీసీలకు అవకాశం ఇవ్వండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రిప్రజెంటేషన్ ఇస్తే నాకు ఇచ్చే ఇంట్రెస్ట్ లేదు అని చెప్పాడు

## తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో

## 34 ఏళ్ల యువకుడు అదృశ్యం...

**సికింద్రాబాద్ (తుకారం గేట్/శుభ తెలంగాణ),** ఆగస్టు 3, 2024: సికింద్రాబాద్ మారేడిపల్లి ప్రాంతంలోని మహేంద్ర హిల్స్ లోని ధనలక్ష్మి అపార్ట్‌మెంట్ నివాసి ఎం. రాజు, వయస్సు 34 సంవత్సరాలు, జులై 27న తన ఇంటి నుండి పనికి వెళ్లినప్పటి నుండి కనిపించడం లేదు.ఈ నేపథ్యంలో, ఆగస్టు 3న ఆయన భార్య ఎం.సంధ్య పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా తుకారం గేట్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు (క్రైమ్ నెంబర్ 215/2024). రాజును వెతికేందుకు విచారణ వేగవంతం చేశారు.రాజు సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కొంత ఆలస్యం కావచ్చని.అందుకే ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్సై ఎం. మాన్‌సింగ్ తప్పిపోయిన రాజు గురించి వివరాలు తెలియజేస్తూ, అతని ఆచూకీ తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలనీ, సమాచారాన్ని అందించిన వారికి తగిన బహుమతి ఇస్తామని పేర్కొన్నారు.

తప్పిపోయిన యువకుడు ఎం. రాజు వివరాలు:
తండ్రి పేరు: దేశయ్య
వయస్సు: 34 సంవత్సరాలు
వృత్తి: లేబర్
కులం: ఎస్టి (లంబాడీ)
రెసిడెన్స్: ప్లోట్ నంబర్ 79, ధనలక్ష్మి అపార్ట్‌మెంట్, మహేంద్ర హిల్స్, మారేడిపల్లి, సికింద్రాబాద్
ఫోన్ నంబర్: 9704529053 (స్విచ్ఛాఫ్)
ఎత్తు: 5'4"
**రంగు:** ఫెయిర్
**ధరించిన దుస్తులు:** పసుపు చొక్కా మరియు నలుపు ప్యాంటు
తెలిసిన భాషలు: తెలుగు, హిందీ, బంజారా
ఇలాంటి మరిన్ని వివరాలు ఉంటే స్థానిక పోలీసులకు తెలియజేయగలరు.

## స్కిల్ సెన్సెస్ దిశగా అడుగులు...

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** స్కిల్ సెన్సెస్ చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం... వినూత్నంగా చేయాలని నిర్ణయించింది. కేవలం చదువుకున్న వారి వివరాలే కాకుండా అందరిలో ఉన్న స్కిల్‌ను వెలికితీసే దిశగా చర్యలు తీసుకుంటోంది. 15ఏళ్ల నుంచి దాదాపు అరవై ఏళ్ల వరకు వయసున్న వారి స్కిల్స్‌ను గుర్తించేందుకు ఈ గణన ఉపయోగపడాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజల ఇష్టాలు తెలుసుకొని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని భావిస్తోంది ప్రభుత్వం. స్కిల్ గణన కోసం ఏపీ ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకొచ్చి ప్రజల నైపుణ్యాలు, వారు ఇంకా ఏ రంగంలో రాణించాలనే ఆలోచనలో ఉన్నారో తెలుసుకోనుంది. కేవలం ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారి వివరాలే కాకుండా వ్యవసాయం సహా ఇతర చేతి వృత్తుల వారిని కూడా ఈ విభాగంలోకి తీసుకురానుంది. ఇలా చేయడం వల్ల ఏ రంగంలో ఎంత మంది ప్రజలు ఉన్నారో తెలియనుంది. వారికి ఉన్న ఆసక్తి తెలుసుకొని వారికిని ట్రైనింగ్ ఇవ్వడం అందులో లేటెస్ట్ విధానాలు వివరించగలుగుతామని ప్రభుత్వం ఆలోచన. ఈ యాప్ ద్వారా ప్రజల వృత్తి నైపుణ్యాలను అంచనా వేయడం ద్వారా వారికి ఉన్న ఆసక్తితోపాటు వారి నైపుణ్యాలు మెరుగుపరిచే పనికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. వారి స్థాయిని కూడా వర్గీకరించే వీలు ఉంటుందంటున్నారు. దీనికి అనుగుణంగా వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం సులభమవుతుందని అంటున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చే యాప్‌లో ఎక్కడి నుంచైనా లాగిన్ కావచ్చు. ఫోన్ నెంబర్ ఉంటే చాలు ఓటీపీ ద్వారా లాగిన్ కావచ్చు. అందులో వ్యక్తిగత వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడ ఉన్నాసరి ఏపీకి చెందిన వారైతే చాలు ఈ యాప్‌లో తమ వివరాలు అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంకో విధానంలో కూడా వివరాలు ఇందులో పొందుపరిస్తారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి ఈ యాప్‌లో అప్లోడ్ చేస్తారు. ఒక్కొక్కరు ఇరవై మంది వివరాలును సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ స్కిల్ సెన్సెస్ తర్వాత మరో అడుగు ముందుకు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ యాప్‌నకు పరిశ్రమలను అటాచ్ చేయనుంది. అంటే తమ రాష్ట్రంలో ఈఈ నైపుణ్యాలు కలిగి ఉన్న వ్యక్తులు ఉన్నారని వారికి తెలియజేసి వారిని ఉద్యోగాల్లోకి తీసుకునేలా చేయడం రెండో లక్ష్యం. అటుప్రజలకు ఇటు పరిశ్రమలకు మధ్య గ్యాప్‌ను తగ్గించి నిరుద్యోగతను తగ్గించాలని భావిస్తోంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మొదట్లోనే తొలిసారి ఐదు సంతకాలు చేశారు. అందులో ఈ స్కిల గణన కూడా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్యాలను గుర్తించి దానికి అనుగుణంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

## హాస్టల్ లో యదేచ్ఛగా డ్రగ్స్

**హైదరాబాద్ , శుభ తెలంగాణ:** హైదరాబాద్‌లో తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు రూటు మార్చాయి. నిన్నమొన్నటివరకూ పబ్‌లు, విద్యాసంస్థలు, ఐటీ ఆఫీసుల్లో దాడులు చేసిన పోలీసులు.. ఇప్పుడు హైదరాబాద్‌లోని హాస్టళ్లపై ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే.. హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్ బాయ్స్ హాస్టల్‌లో డ్రగ్స్, గంజాయి దొరకడం కలకలం రేపింది. ఎస్ఆర్‌నగర్‌లోని వెంకట్ బాయ్స్ హాస్టల్‌లో తనిఖీలు చేయగా.. 250 గ్రాముల గంజాయి, 115 గ్రాముల ఓఆఓం డ్రగ్స్ పట్టుబడడంతో సీజ్ చేశారు. దీనికి సంబంధించి ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ అధికారులు.. గత కొన్నాళ్లుగా ఎస్ఆర్‌నగర్ హాస్టల్ కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తేల్చారు.అయితే.. ఇటీవల అరెస్ట్ అయిన మాదాపూర్ రేవ్ పార్టీ డ్రగ్స్ కేసు నిందితులు ఇచ్చిన వివరాలతోనే ఎస్ఆర్‌నగర్ బాయ్స్ హాస్టల్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి. మాదాపూర్ క్లౌడ్‌నైన్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీని భగ్నం చేసి.. 20 మందిని అదుపులోకి తీసుకుని విచారించగా ఎస్ఆర్‌నగర్ హాస్టల్స్ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. నాగరాజుయాదవ్ బర్త్‌డే సందర్భంగా గోవా నుండి డ్రగ్స్ తెప్పించి రేవు పార్టీ నిర్వహించగా.. ఐదుగురిని నిందితులుగా చేర్చామని చెప్పారు. ఇక.. నాగరాజుతో పాటు గోవా నుండి డ్రగ్స్ తీసుకొచ్చిన మరో నిందితుడు నిఖిల్‌ను విచారించగా.. లోకేష్ అనే మరో వ్యక్తికీ డ్రగ్స్ దందాలో భాగస్వామ్యం ఉన్నట్లు చెప్పాడన్నారు. దాంతో.. లోకేష్ గురించి వివరాలు సేకరించిన ఎక్సైజ్ పోలీసులు.. ఎస్ఆర్‌నగర్‌లోని వెంకట్ బాయ్స్ హాస్టల్‌లో అదుపులోకి తీసుకున్నారని తెలిపారు కమలాసన్‌రెడ్డి.ఆ తర్వాత.. బాయ్స్ హాస్టల్‌లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీ నిర్వహించగా.. ముగ్గురు వ్యక్తుల దగ్గర డ్రగ్స్ లభించడంతో వారిని అరెస్ట్ చేశామన్నారు. చిత్తూరుకు చెందిన భారి, లోకేష్‌తోపాటు మరొకర్ని అరెస్ట్ చేశామని.. అయితే.. వీరికి డ్రగ్స్ ఎలా అలవాటు అయ్యాయనేదానిపై మరింత లోతైన దర్యాప్తు చేస్తామని చెప్పారు కమలాసన్‌రెడ్డి. మొత్తంగా.. హైదరాబాద్‌లోని హాస్టల్స్‌లోనూ డ్రగ్స్ పట్టుబడడం కలకలం సృష్టిస్తోంది

## ఇళ్లకు 4. 50 లక్షలు

**ఖమ్మం, శుభ తెలంగాణ :** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ) శనివారం కీలక ప్రకటన చేశారు. పథకంలో భాగంగా ఈ నెలాఖరులోపు మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. అర్హులైన వారందరికీ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క పర్యటించారు. గాంధీనగర్ క్రాస్ మైలారం గుట్టపై ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేశారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110